సాక్షి
వికారాబాద్

శుక్రవారం : 26 : జనవరి : 2024



పత్తి పైసలకు పాట్లు

పత్తి రైతులకు ఏటా కష్టాలు తప్పడం లేదు. పంట విక్రయించినా సకాలంలో డబ్బులు అందక అవస్థలు పడుతున్నారు. 10లో▸



పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

న్యూస్‌రీల్

డీఎంఅండ్‌హెచ్‌ఓకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న పల్వన్‌కుమార్

అనంతగిరి: ఉత్తమ వైద్య సేవలకు గాను డీఎంఅండ్‌హెచ్‌ఓ పల్వన్‌కుమార్‌కు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి లభించింది. గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా, ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్నన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ రవీంద్రనాయక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

కోదండరామ్‌కు ఎమ్మెల్సీ హర్షణీయం

తెలంగాణ జన సమితి కౌన్సిలర్ సోమశేఖర్



కోదండరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సోమశేఖర్

తాండూరు టౌన్: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌కు ఎమ్మెల్సీ పదవి కేటాయించడం హర్షణీయమని తెలంగాణ జన సమితి తాండూరు పట్టణ కౌన్సిలర్ సోమశేఖర్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో కోదండరామ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం తెలంగాణ పౌర సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ, ఉద్యమ ఆకాంక్షలు నెరవేరే వరకు పట్టు విడవరాదని చెప్పిన మహనీయుడన్నారు.

నేటి నుంచి ఆనంద్ ఉత్సవ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక ఆనంద్ ఉత్సవ్‌కు హైదరాబాద్ వేదికగా నిలిచింది. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా ఈ ఉత్సవాలు ఇక్కడ నిర్వహిస్తున్నామని శ్రీనాథ్ జీ ధ్వజాజీ ఆనంద్ ఉత్సవ్ కమిటీ వెల్లడించింది. సనాతన ధర్మం విలువలు సమాజంలో మరింత మందికి తెలియజేప్పేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపింది.

ప్రాణాలతో చెలగాటం!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (ప్రస్తుతం వికారాబాద్ జిల్లా) దోమ మండలం పాలెపల్లికి చెందిన ఇంటర్ విద్యార్థిని లక్ష్మి(18) జ్వరంతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ శివరాంను ఆశ్రయించింది. అయన గడువు తీరిన (అజిత్రోమైసిన్ 500 ఎంజీ) టాబ్లెట్ ఇచ్చారు. టాబ్లెట్ వేసుకున్న కొద్ది సేపటికే బాధితురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాతపడింది. తల్లిదండ్రులు సదరు ఆర్ఎంపీపై పోలీసులుకు ఫిర్యాదు చేయగా, కేసు కూడా నమోదు చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నా.. వాటిని నియంత్రించాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు.



అయువు తీస్తున్న గడువు తీరిన మందులు

- జిల్లాలో విచ్చలవిడిగా నకిలీ విక్రయాలు
- ప్రిస్క్రిప్షన్ లేకుండానే యథేచ్ఛగా అమ్మకాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొంత మంది ఫార్మాసిస్టులు, ఆర్ఎంపీలు, పీఎంపీలు ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారు. తమ వద్దకు వచ్చే రోగులకు గుట్టుగా గడువు ముగిసిన, నిషేధిత జాబితాలో ఉన్న మందులను విక్రయిస్తున్నారు. సాధారణ జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి మందులే కాదు ప్రమాదకరమైన యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్లు, యాంటి డిప్రెషన్ మందులు, మత్తు ఇంజక్షన్లు, స్లీపింగ్ టాబ్లెట్స్, స్టెరాయిడ్స్, గర్భ విచ్ఛిత్తి మందులు అమ్ముతున్నారు. నిజానికి క్వాలిఫైడ్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ చూసిన తర్వాతే ఈ మందులు అమ్మాల్సి ఉంది. కానీ మెజార్టీ ఫార్మాసిస్టులు కనీసం ప్రిస్క్రిప్షన్ చూడకుండా ఇష్టం వచ్చినట్లు ఇచ్చేస్తున్నారు. కొన్ని ఫార్మసీలైతే ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే చాలు ఏకంగా ఇంటికే మందులు సరఫరా చేస్తున్నాయి. వీటిలో గడువు తీరిన, నిషేధిత జాబితాలో ఉన్న డ్రగ్స్ కూడా ఉంటున్నట్లు సమాచారం. దగ్గుకు వాడే సిరప్‌లలో కొంత మ త్తు ప్రభావం ఉంటుంది. మాదక ద్రవ్యాలు వినియోగించే వారు వాటికి బదులుగా వీటిని వాడుతున్నారు. కార్డియాక్, సైక్రియాట్రిక్స్, న్యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, అబార్షన్, డయాబెటిక్, టీపీ, స్లీపింగ్, యూరిన్ ఇన్‌ఫెక్షన్ తదితర రకాల మందులను డాక్టర్ రాస్తేనే మెడికల్ దుకాణాల నిర్వాహకులు అమ్మాలి. ప్రిస్క్రిప్షన్‌పై ఎన్ని రోజులకు రాస్తే అన్నే ఇవ్వాలి. మందుల చీటీపై షాప్ స్టాంప్ కూడా వేయాలి. దీంతో ఇతర చోట్ల కొనుగోలు చేయకుండా నిరోధించొచ్చు. రోగి సెల్‌నంబర్, చిరునామా కూడా బిల్లుపై పొందుపర్చాలి. అన్‌వాంటెడ్ ప్రెగ్నెన్సీ 72 గంటల పేరుతో ఉండే మందులను కూడా ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఇవ్వాలి. కానీ దుకాణ నిర్వాహకులు ఇవేమీ పాటించడం లేదు.

డీసీఏలకు నెలవారీగా మామూళ్లు

రాష్ట్ర వ్యాప్తంగా 45 వేలకుపైగా ఔషధ దుకాణాలు ఉండగా, వీటిలో గ్రేటర్ జిల్లాల్లోనే 25 వేల వరకు ఉన్నట్లు అంచనా. జిల్లాలోని మెజార్టీ ఫార్మసీల్లో టెన్త్, ఇంటర్ చదువుకున్న వారే. కొంతమంది వ్యాపారులు బీఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థుల నుంచి సర్టిఫికెట్లు అద్దెకు తీసుకుని, స్టోర్లు ఏర్పాటు చేసి, వాటిలో తక్కువ జీతానికి పని చేసే అభ్యర్థులను నియమించి మందులు విక్రయిస్తున్నారు. మరికొంత మందైతే ఏకంగా ఆహార ఉత్పత్తుల విక్రయానికి అనుమతులు తీసుకుని, వాటి మాటున ప్రమాదకరమైన ఇంజక్షన్లు విక్రయిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. నిజానికి డ్రగ్ కంట్రోల్ బోర్డు అధికారులు మూడు నెలలకోసారి విధిగా ఆయా షాపుల్లో తనిఖీలు నిర్వహించాల్సి ఉంది. ఏజెన్సీల నుంచి సరఫరా అవుతున్న మందులు, విక్రయాలు, గడువు ముగిసిన మందులను గుర్తించి, నోటీసులు జారీ చేయాలి. కానీ జిల్లాలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఇవేవీ పట్టించుకోవడం లేదు. అడిగినంత ఇస్తే చాలు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆమనగల్లు, కడ్తాల్, షాద్‌నగర్, కేశంపేట, షాబాద్, యాచారం, మంచాల, చేవెళ్లలో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు తెలిసింది. ఫార్మసీల్లోనే కాదు ఆర్ఎంపీలు, పీఎంపీలు సైతం ఈ ప్రమాదకరమైన మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం.

తనిఖీలు చేయాలి

డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940 ప్రకారం ప్రతి మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫార్మాసిస్టు ఉండాలి. బీఫార్మసీ, ఎంఫార్మసీ, డీఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్న వారు మాత్రమే దుకాణాలు నిర్వహించాల్సి ఉంటుంది. అనుమతి ఇచ్చే సమయంలో ఔషధ నియంత్రణ అధికారులు ఫార్మసిస్టు ఉన్నదీ, లేనిది పరిశీలించాలి. సంబంధిత ఏరియా ఇన్‌స్పెక్టర్లు కూడా తనిఖీలు చేయాలి. లేకపోతే షోకాజ్ నోటీసు జారీ చేయాలి. కెమిస్ట్ అండ్ డ్రగ్స్ ట్రేడర్లు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

– ఆకుల సంజయ్ రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ ఫార్మా సొసైటీ

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- ఉదయం 9గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ

వికారాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి జిల్లా ఉన్నతాధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 9గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్, ఎస్పీ ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేయనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ముందస్తు తనిఖీలు

అనంతగిరి: గణతంత్ర వేడుకల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. గురువారం జిల్లాలోని రైల్వే స్టేషన్లు, బస్‌స్టేషన్లు, మార్కెట్లలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే పోలీసులు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. తనిఖీల్లో బీడీ టీం అధికారులు సంజీవయ్య, విఠల్, రాఘవేందర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న బాంబ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది

దూసుకొచ్చిన మృత్యు శకటం

- బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- తల్లీకుమారుల దుర్మరణం



పార్వతమ్మ, భాను (ఫైల్)

ఇబ్రహీంపట్నం: మృత్యుశకటంగా దూసుకొచ్చిన ఓ డీసీఎం తల్లీకుమారులను బలితీసుకుంది. ప్రమాదం జరిగిన తర్వాత నిలపకుండా వ్యాన్‌తోనే డ్రైవర్ ఉడాయించడంతో తల్లీకుమారులు విలవిల్లాడుతూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలారు. ఈ విషాదకర సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. దండుమైలారం గ్రామానికి చెందిన తల్లీకుమారులైన రావుల పార్వతమ్మ (39), రావుల భాను(20) బైక్‌పై చాదర్‌ఘల్లిలోని కూతురింటికి వెళ్తున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని వైట్ గోల్డ్ కంపెనీ వద్ద రాగానే వీరి బైక్‌ను అతివేగంగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల్లీకుమారులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ డీసీఎంతో పారిపోయాడు. విషయం తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పో లీసులు మృతదేహాలను ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసు కొని డీసీఎం డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా మృత్యువాత పడిన భాను ఒగ్గు కథలు చెబుతూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. తల్లీకుమారుల మృతితో స్వగ్రామమైన దండుమైలారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముహూర్తం ఖరారు

- ఫిబ్రవరి 9న ప్రత్యేక సమావేశం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో అవిశ్వాసంపై అధికారులు స్పష్టతనిచ్చారు. కలెక్టర్ శశాంక పాలకవర్గం సభ్యులకు నోటీసులు అందజేశారు. ఫిబ్రవరి 9న మధ్యాహ్నం 12గంటలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదేశాలు జారీ చేశారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గం సభ్యులకు ఇప్పటికే నోటీసులు అందించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లను తొలగించడానికి ముహూర్తం ఖరారు చేశారు. ప్రత్యేక సమావేశంలో నూతన చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. దీంతో క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. 9వ వార్డు కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డిని చైర్మన్‌గా చేయడానికి సిద్ధమయ్యారు.

పోలీస్ సేవలకు 'జాతీయ' గుర్తింపు



కేవీవీ రెడ్డి

బడంగ్‌పేట్: సీఆర్‌పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించిన కేవీవీ రెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీస్‌గా ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రధాని చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు. ఇటీవలే సీఆర్‌పీఎఫ్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న ఆయన సేవలను కేంద్రం గుర్తించింది. 2015లోనూ ప్రధాని మోదీపాటు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ పోలీసు అవార్డు అందుకున్నారు. 11ఏళ్లపాటు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌లో కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన బడంగ్‌పేట పరిధిలోని బాలాపూర్‌లో సీబీఎస్‌ఈతో కూడిన ఏడీఎపీ స్కూల్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్నారు.

కేంద్ర విధానాలపై ఉద్యమిద్దాం

- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద జరిగిన సభలో సాగర్ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం రెండేళ్ల క్రితం రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకువచ్చిందని, ఏడాదిపాటు సాగిన ఆందోళనలతో దిగివచ్చి రద్దు చేసిందని గుర్తు చేశారు. దొడ్డిదారిన వాటిని అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని అన్నారు.

వీళ్లు మారరా..!

మరో ప్రాణం తీసిన డ్రంకన్ డ్రైవింగ్

- సిబ్బంది కొరతతో తనిఖీలకు ఇబ్బందులు
- కేసులు నమోదు చేస్తున్నా మారని మందుబాబులు
- రానున్న రోజుల్లో మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయం



సాక్షి, సిటీబ్యూరో: కొన్నిరోజుల క్రితం డీకే నగర్‌లో స్టూడెంట్ దేవి.. ఆ మధ్య పంజగుట్ట వద్ద చిన్నారి రమ్య కుటుంబం.. తాజాగా జూబ్లీహిల్స్‌లో బౌన్సర్ తారక్.. సంచలనం సృష్టించి, రికార్డులకెక్కిన డ్రంక్ డ్రైవింగ్ ప్రమాదాలు ఇవి. వీటికి తోడు వెలుగులోకి రాని ఉదంతాలెన్నో. గతంలో ప్రమాదాలకు భిన్నంగా.. బుధవారం నాటి ప్రమాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. సీసీ కెమెరాలకు కూడా నంబర్ ప్లేట్ చిక్కని వేగంతో కారు నడిపి, బౌన్సర్ తారక్ మృతికి కారణమైన రిత్విక్ రెడ్డి కూడా మద్యం మత్తులో ఉన్నట్లు జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం ప్రకటించారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఏటా ఎందరు జైలుకు వెళ్తున్నా, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా మందుబాబుల్లో మాత్రం మార్పు రావడంలేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

రాత్రి వేళల్లో మద్యం తాగేవారికి, ఆ స్థితిలో వాహనాలు నడిపే వారికి సమయం, సందర్భం అంటూ ఉండదు. డ్రంక్ డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు మాత్రం ఇవి ఉంటాయి. ప్రధానంగా వీకెండ్స్‌గా పిలిచే శుక్ర, శనివారాల్లో రెగ్యులర్‌గా, మిగిలిన సమయాల్లో ఆకస్మికంగా ఈ తనిఖీలు చేపడుతున్నారు. ఈ డ్రైవ్స్ నిర్వహణకు నిర్దిష్ట సమయం ఉంటోంది. ఎప్పుడైనా కానీ కొన్ని గంటలు మాత్రమే చేపట్టగలుగుతున్నారు. ఈ విధులు నిర్వర్తించిన, పర్యవేక్షించిన వారే మరుసటి రోజూ విధులకు హాజరకావాల్సి ఉండటంతో ఇలా చేయాల్సి వస్తోంది. ట్రాఫిక్ విభాగంలో ఉన్న సిబ్బంది కొరత నేపథ్యంలో ప్రతి రోజూ, రాత్రంతా డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు చేపట్టలేకపోతున్నారు. దీన్నే మందుబాబులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

తెలివిమీరుతున్న మందుబాబులు..

ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించే రోజులు, సమయాలు, స్థలాలను గమనిస్తున్న మందుబాబులు తెలివిమీరి ప్రవర్తిస్తున్నారు. డ్రంక్ డ్రైవింగ్‌పై తనిఖీలు ఉండని రోజుల్లో, సమయాల్లో రెచ్చిపోతున్నారు. అవి జరిగే వారాంతాల్లోనూ గల్లీలు, ఇతర మార్గాలను అనుసరిస్తూ పోలీసులకు చిక్కట్లేదు. కొందరైతే ఏకంగా వాట్సాప్ గ్రూపుల్లో డ్రంక్ డ్రైవింగ్ జరిగే ప్రాంతాలు, సమయాలకు సంబంధించిన సమాచార మార్పిడి చేసుకుంటూ వాహనాలపై దూసుకుపోతున్న సందర్భాలూ ఉన్నాయి. ఇదే అనేక సందర్భాల్లో ప్రమాదహేతువుగా మారుతోంది. మద్యం తాగి వాహనం నడుపుతూ తామంతట తాము ప్రమాదానికి లోనైన ఉదంతాలు అసలు వెలుగులోకే రావడం లేదు. ఎదుటి వారిని ఢీకొట్టినప్పుడో, సంచలనాత్మక ఉదంతం జరిగినప్పుడో మాత్రమే ఈ విషయం వెల్లడవుతోంది.

తీవ్రమైన సెక్షన్లతో కేసులు

సాధారణంగా రోడ్డు ప్రమాద సంబంధ ఉదంతాలు చోటు చేసుకున్నప్పుడు పోలీసులు ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)లోని సెక్షన్ 304 (ఎ) కింద కేసు నమోదు చేస్తారు. డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ ఎదుటి వారి మరణానికి కారణమైన వారిపై ఐపీసీలోని సెక్షన్ 304 (పార్ట్-2) కింద కేసు నమోదు చేయడం ప్రారంభించారు. '304 ఏ' అంటే నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ఓ ప్రాణం పోవడానికి కారణం కావడం. అయితే మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తిపై కేసు నమోదుకు ఐపీసీలోని 304 పార్ట్ 2సెక్షన్ సరిగా సరిపోతుందని పోలీసులు నిర్ణయించారు. అంటే మద్యం తాగిన సదరు వ్యక్తి తన డ్రైవింగ్ వల్ల ఎదుటి వారికి ప్రాణహాని ఉంది అని తెలిసీ పట్టించుకోకపోవడమని అర్థం. ఇలాంటి కేసుల్లో బెయిల్ సైతం తొందరగా లభించదు. న్యాయస్థానంలో నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల నుంచి జీవిత ఖైదు లేదా జరిమానాలేదా రెండూ విధించే అవకాశం ఉంది. ఈ సెక్షన్ కింద నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ సైతం లభించదు.

ప్రమాదం జరిగితే పక్కా చర్యలు


తాజా పరిణామాల నేపథ్యంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వ్యక్తి వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాల్లోనూ మద్యం పరీక్షలు తప్పనిసరి చేస్తున్నారు. దాదాపు ప్రతి రోడ్డు ప్రమాదం కేసులోనూ దానికి బాధ్యులైన వ్యక్తికి శాంతిభద్రతల విభాగం అధికారులు ట్రాఫిక్ పోలీసుల సాయంతో తక్షణమే బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో పాటు ఈ ఏడాది ప్రారంభం నుంచి డ్రగ్ పరీక్షలు, అవసరమైన సందర్భాల్లో రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయించడం ద్వారా వైద్యులు ఇచ్చే పత్రాలను కేసు ఫైల్‌లో చేరుస్తున్నారు. సదరు వ్యక్తి మద్యం తాగి ఉన్నట్లు తేలితే... 304 పార్ట్ 2 తదితర సెక్షన్లను జోడిస్తున్నారు. ప్రమాదం 21 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారి వల్ల జరిగితే.. వారు మద్యం తాగిన బార్/పబ్, విక్రయించిన వైన్ షాపు లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి/డ్రంకన్ డ్రైవ్‌లో చిక్కిన ఉల్లంఘనులు డ్రైవింగ్ లైసెన్స్ లేని వాడైతే ఆ వాహనం ఎవరి పేరిట ఉందో ఆ యజమానిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

గత ఏడాది డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- మొత్తం కేసులు: 37,866
- చార్జ్‌షీట్ దాఖలు చేసినవి: 37,956 (పాత వాటితో కలిపి)
- మందుబాబులకు విధించిన జరిమానా: రూ.8,22,83,024
- జైలుశిక్ష పడినవాళ్లు: 3,782
- డ్రైవింగ్ లైసెన్స్ రద్దయినవాళ్లు: 556

ఓటు ఎంతో విలువైనది

- ప్రలోభాలకు గురికావొద్దు
- మనల్ని పాలించే నాయకుల్ని నిర్ణయిస్తుంది
- యువత చేతుల్లోనే దేశ భవిష్యత్
- ఓటింగ్‌లో జిల్లాను ముందు వరుసలో నిలపాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులు, యువతీ యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు ఎన్నేపల్లి చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ఆయా పాఠశాలల విద్యార్థులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు ఎంతో అమూల్యమైనదని అన్నారు. ఓటే మనల్ని పాలించే నాయకుల్ని నిర్ణయిస్తుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. బాధ్యతగా భావించి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటరు శాతం పెంచేందుకు యువత ఎన్నికల రోజు తమ వాట్సాప్ స్టేటస్ ద్వారా మెసేజ్ ఇవ్వాలన్నారు. ప్రజల ప్రయోజనాలను ఆకాంక్షించే నేతలను ఎన్నుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని జిల్లాను దేశంలోనే ముందు వరుసలో నిలపాలన్నారు. ఎలాంటి ప్రలోభాలు, భయాందోళనకు గురి కాకుండా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే మనది అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ అన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. చదువుకున్న యువత కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. తమ గ్రామం, ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సామాజిక స్పృహ కలిగిన నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గవర్నర్ తమిళిసై నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

కొత్తపల్లి విద్యార్థుల ప్రతిభ

కుల్కచర్ల: ఓటు హక్కు ప్రాముఖ్యతపై చౌడాపూర్ మండలం కొత్తపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులు రూపొందించిన వీడియో స్కిట్‌కు రాష్ట్రస్థాయిలో రెండో స్థానం లభించింది. ఓటును అమ్ముకోవద్దు, ఒక్క ఓటు మన జీవితంతో పాటుగా ఒక కుటుంబం మొత్తాన్ని ప్రభావితం చేస్తుందన్న కథాంశంతో స్కిట్ రూపొందించారు. జిల్లాస్థాయి పోటీల్లో ఈ వీడియో స్కిట్ ప్రథమ స్థానాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ంది. అక్కడ రెండో స్థానంలో నిలిచింది. గురువారం గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రం అందుకున్నారు. మారుమూల పాఠశాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన వీడియో స్కిట్ రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలవడం ఎంతో అభినందనీయమని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓటరు అవగాహన అధికారి కోటాజీ, కొత్తపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇసుక పర్మిషన్ ఇవ్వొద్దు

తాండూరు రూరల్: మా ఊరి నుంచి ఇసుక పర్మిషన్ ఇవ్వొద్దని మండల పరిధిలోని వీరిశెట్టిపల్లి గ్రామస్తులు కోరారు. గురువారం తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌కు గ్రామ సర్పంచు నాగప్ప ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ...వీరిశెట్టిపల్లి వాగులో నుంచి ఇసుక తరలించొద్దని హైకోర్టు నుంచి ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇసుక తరలిస్తే భవిష్యత్‌లో భూగర్భజలాలు అడుగంటిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి వీరిశెట్టిపల్లి గ్రామం నుంచి ఇసుక పర్మిషన్ రద్దు చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచు చీమల నర్సింలు, నాయకులు మంగలి నర్సింలు, శ్రీనివాస్, నర్సింలు ఉన్నారు.

మండల వాసికి పోలీస్ సేవా పతకం



సీపీ మహంతి చేతుల మీదుగా పతకాన్ని స్వీకరిస్తున్న మల్లేష్‌గౌడ్

కుల్కచర్ల: విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తున్న కుల్కచర్ల మండలానికి చెందిన కురుంపల్లి మల్లేశ్ ఉత్తమ పోలీసు సేవా పతకం అందుకున్నారు. కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ చేవెళ్ల ట్రాఫిక్ పోలీసు సేష్టన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సైబరాబాద్ పరిధిలోని సీపీ కార్యాలయంలో సీపీ మహంతి చేతుల మీదుగా పతకాన్ని అందుకున్నారు. మల్లేష్ పోలీస్ సేవా పతకం అందుకోవడం పట్ల మండల ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పత్తి పైసలకు పాట్లు

- బ్యాంకు ఖాతాలు ఇస్తే పోస్టాఫీసులో నగదు జమ
- పట్టించుకోని సీసీఐ అధికారులు
- ఆందోళనలో రైతులు



పోస్టాఫీస్ వద్ద పత్తి డబ్బుల కోసం వచ్చిన రైతులు

పెద్దేముల్: పత్తి పంట సాగుచేసే రైతన్నలకు ఏటా కష్టాలు తప్పడం లేదు.. కష్టపడి పండించిన పంటను అమ్ముకున్న రైతులు సకాలంలో డబ్బులు అందక మిల్లుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయాలు చేసిన రైతులు బ్యాంకు పాస్‌బుక్‌లు ఇస్తే, అధికారులు మరో బ్యాంకులో డబ్బులు జమ చేయడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. పెద్దేముల్, కోటపల్లి, బంట్వారంతో పాటు పలు మండలంలో పత్తి విక్రయాలు చేసిన రైతులు తెలంగాణ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ బ్యాంకుల ఖాతా నంబర్‌లు ఇస్తే, సీసీఐ అధికారులు మాత్రం పోస్టాఫీస్‌లో డబ్బులు జమ చేయడంతో రైతులకు అంతు పట్టక తలలు పట్టుకుంటున్నారు. ఓ బ్యాంకు పాస్‌బుక్ ఇస్తే .. పోస్టాఫీస్‌లో డబ్బులు వేయడం, సమాచారం లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తింసాన్‌పల్లి, బుద్దారం, ఆత్మూర్, పెద్దేముల్, మారేపల్లి, గాజీపూర్, మంబాపూర్, నాగులపల్లి, రుద్రారం, గోపాల్‌పూర్‌తో పాటు పలు మండలాల రైతులు పండించిన పత్తి పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో విక్రయాలు చేయడంతో పాటు ఆ బ్యాంకుకు సంబంధించిన పాస్‌బుక్, భూమి పట్టాబుక్, ఆధార్‌కార్డును జమచేసి రెండు సెట్‌లు సీసీఐ అధికారులకు అందచేశారు. గతంలో రైతులు ఏ బ్యాంకు ఖాతా నంబర్ ఇస్తే అదే బ్యాంకుల్లో డబ్బులు జమ అయ్యేది. ఈ ఏడాది రైతులు పత్తి విక్రయాలు చేసిన వెంటనే తెలంగాణ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా, ఎస్‌బీఐతో పాటు ఇతర బ్యాంకు పాస్ బుక్‌లు జమచేసి అధికారులకు ఇచ్చారు. సుమారు నెల రోజులైన సమాచారం రాకపోవడంతో రైతులు సీసీఐ అధికారుల చుట్టూ ప్రదక్షణలు చేయడంతో అసలు విషయం బయటపడింది. ఎక్కువ శాతం పత్తి పంటలు పండించిన రైతుల పోస్టాఫీస్‌లో జమ కావడంతో ఇబ్బందులు పడ్డారు. తీరా పోస్టాఫీస్‌లో పూర్తి స్థాయిల్లో డబ్బులు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో పత్తి రైతులు డబ్బుల కోసం వెళ్లగా అక్కడి పోస్టాఫీస్ అధికారులు రూ.50వేల కంటే ఎక్కువ లేవని , అవసరం అయితే ఇతర బ్యాంకులకు ట్రాన్స్‌ఫర్ చేస్తాం. కానీ డబ్బులు కట్ అవుతాయని చెప్పడంతో రైతులు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులు ఏ బ్యాంకు పాస్ బుక్ ఇస్తే అదే బ్యాంకుల్లో వేయాలని, దీనిపై రైతులకు వ్యవసాయ శాఖ, మార్కెట్ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పలు గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో పోస్టాఫీస్ అధికారులకు కూడా తలనొప్పిగా ఉందని పలువురు అంటున్నారు.

దాతలు సహకరించండి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు



విరాళాలను సేకరిస్తున్న సంఘం నేతలు

దోమ : ఢిల్లీలో నిర్మించ తలపెట్టిన అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆల్ ఇండియా బిల్డింగ్ నిర్మాణానికి దాతలు సహకారం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం నేతలతో కలసి ఇంటింటికి తిరుగుతూ విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రైతుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రైతులు దేశానికే అన్న పెడుతున్న శ్రమజీవులని అలాంటి రైతులను ప్రభుత్వాలు విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, మండల అధ్యక్షుడు సత్యయ్య, మండల ప్రధానకార్యదర్శి రఘురాం, నేతలు మహిపాల్ రెడ్డి, చెన్నారెడ్డి, మొగులయ్య, శేఖర్, కృష్ణ, సాయిబాబు, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు..

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

తాండూరు రూరల్ : మద్యం తాగొద్దన్నందుకు ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని జినుగుర్తిలో గురువారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు మండలం జినుగుర్తి గ్రామానికి చెందిన పటోళ్ల మోహన్‌రెడ్డి రెండో కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి(26), మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. బుధవారం రోజు రాత్రి శ్రీకాంత్‌రెడ్డి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తండ్రి మోహన్‌రెడ్డి మద్యం తాగొద్దని మందలించాడు. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయి వారి పొలంలోని చెట్టుకు ఉరేసుకోనున్నాడు. గురువారం తండ్రి మోహన్‌రెడ్డి పొలానికి వెళ్లి చూడగా శ్రీకాంత్‌రెడ్డి మృతి చెంది ఉన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు



మైక్‌సెట్ అందచేస్తున్న మాజీ సర్పంచ్ నర్సింలు

పెద్దేముల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని.. ప్రతి మనిషికి చదువు మూడవ కన్ను లాంటిదని తాండూరు ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పెద్దేముల్ మండల హన్మాపూర్ మాజీ సర్పంచ్ లోంక నర్సింలు అన్నారు. గురువారం పెద్దేముల్ మండల ఇందూరు ఉన్నత పాఠశాలకు రూ.30వేలతో మైక్‌సెట్ (బాక్స్)లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా చదివించాలన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. 10వ తరగతిలో ఇందూరు ఉన్నత పాఠశాల జిల్లాలో టాప్‌లో నిలవాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు కష్టపడి చదివితే సాధించలేనిది ఏది లేదన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, ఉపాధ్యాయులు అంజయ్య, ప్రభాకర్ రెడ్డి, అనంతనర్సింహ, ఆనంద్‌కుమార్, శకుంతల, విజయానంద్, వెంకటేశం, గ్రామపెద్దలు, తోటి యువకులు రాములు, బాలు, దేవ్‌సింగ్,విజయ్‌కాంత్, నరేష్‌గౌడ్, నవీన్,సంజు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాల దుకాణాన్ని సీజ్ చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: కల్తీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తున్న సీడ్స్, ఫెర్టిలైజర్ దుకాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. పూడూరు మండలంలోని సిరిగాయపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే రైతు పట్టణ కేంద్రంలోని శ్రీ మహేశ్వరీ సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్ దుకాణంలో 10 కేజీల వరి విత్తనాలను కొనుగోలు చేశాడు. వీటితో పంట సాగు చేస్తే గింజలు రాకపోవడంతో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డిని కలిసి దుకాణంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. రైతు వరిపంట సాగు చేసినప్పటి నుంచి కోత దశ వరకు దుకాణం యాజమాన్యానిని పలుమార్లు కలిసి పంట ఇంకా పూత రావడం లేదని అడిగితే ఎలాంటి సమాధానం చెప్పలేదని అన్నారు. పంట ఏపుగా పెరిగిందే తప్ప గింజలు రాలేదని అన్నారు. ప్రభుత్వం రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించవద్దని ఎంత కట్టడి చేసినా రైతులను మోసం చేస్తునే ఉన్నారని ఆరోపించారు. దుకాణాల యాజమానులపై అధికారులు కఠిన చర్యలు తీసుకుని దుకాణాన్ని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, సీపీఎం నాయకులు హబీబ్, లాలయ్య, ఆనంద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



నిజాయితీగా ఓటు వేయాలి

ఆర్డీఓ విజయకుమారి



వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీఓ తదితరులు

పరిగి: ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని ఆర్డీఓ విజయకుమారి సూచించారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మానవహారం నిర్వహించి విద్యార్థులచే ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా యువత ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యంలో నిజమైన నాయకుడిని ఎన్నుకునేందుకు వీలుంటుందన్నారు. అనంతరం వృద్ధాప్యంలో ఓటు హక్కును వినియోగించుకుంటున్న వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ దుర్మార్గ పాలనకు నిదర్శనం

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గణేశ్



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

పరిగి: ఏబీవీపీ మహిళా నాయకురాలుపై పోలీసులు దాడి చేసిన ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గణేశ్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని నిరసన తెలుపుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని మహిళా పోలీసులు జుట్టుపట్టుకుని ఈడ్చుకెళ్లడం దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వం నోరు మెదపకపోవడం విడ్డూరమన్నారు. వ్యవసాయ రంగానికి మేలు చేయాల్సిన ప్రభుత్వం వ్యవసాయ యూనివర్సిటీలను నిర్వీర్యం చేయడానికి పూనుకుందన్నారు. వెంటనే ఏబీవీపీ కార్యకర్తపై దాడికి పాల్పడిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 55ను రద్దు చేయాలి



అనంతగిరి: మాట్లాడుతున్న హరీష్‌రావు

అనంతగిరి: వ్యవసాయ ఉద్యాన వర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం వికారాబాద్‌లోని ఏబీవీపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 55ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఎంతో ఉపయోగపడే వర్సిటీ భూభాగాన్ని హైకోర్టు నిర్మాణానికి ఇవ్వడం సరికాదన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బుధవారం మా రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు రోడ్డుపై జడ పట్టుకుని ఈడ్చుకుంటూ వెళ్లిన తీరు బాధాకరమన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఓ 55ను రద్దు చేసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి జగదీశ్, మంజునాథరెడ్డి, శివశంకర్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగివున్న కారును ఢీకొన్న స్కూల్ బస్సు

తప్పిన పెనుప్రమాదం



దిర్సంపల్లిలో కారును ఢీకొన్న స్కూల్ బస్సు

దోమ: ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపై నడుపుతుండటంతో ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. గురువారం మండల పరిధిలోని దిర్సంపల్లిలో ఆగివున్న కారును ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పరిగి పట్టణానికి చెందిన న్యూ బ్రిలియంట్ హైస్కూల్ బస్సుస్కూల్ పిల్లలను తీసుకెళ్లేందుకు గ్రామాల్లోకి వస్తుంది. ఈ క్రమంలో దిర్సంపల్లిలోకి రాగానే బస్సుకు బ్రేక్‌లు ఫెయిల్ అయ్యాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును ఆపేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. కంట్రోల్ కాకపోవడంతో గ్రామంలో ఆగివున్న ఓ కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు స్వల్ప డ్యామేజ్ కాగా, బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రమాదం సమయంలో బస్సులో పిల్లలు ఉన్నప్పటికీ వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రైవేటు స్కూల్స్ నడిపించే బస్సులకు ఫిట్‌నెస్ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి



వాహనాలను సీజ్ చేస్తున్న డీఎస్పీ, సీఐ

పరిగి: నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని మల్లేమోనిగూడలో ఇంటింటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేశారు. మొత్తం 84 మంది పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్‌లో పాల్గొని సరైన ధ్రువపత్రాలు లేని 25 టూవీలర్స్, 3 త్రీవీలర్స్, 3 ఫోర్ వీలర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణాల్లో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాలు, పట్టణాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామయ్య, ఎస్సై సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువతే దేశ భవిష్యత్

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, దేశాభివృద్ధికి కృషి చేయాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గుడిపల్లి నితీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన ఓటర్ల సమ్మేళనంలో ప్రజలనుద్దేశించి ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటును నిజాయితీగా వినియోగించుకోవాలన్నారు. ఓటు విలువ తెలిసేలా ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు కొత్తగా ఓటు వేసే వారికి అవగాహన కల్పించాలని వివరించారు. నూతన ఓటర్ల కోసం బీజేవైఎం ఈ కార్యక్రమం నిర్వహించటం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నాయకులు అనంత్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీకాంత్, మధుసుధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జైసింహ, బీజేవైఎం నాయకులు, యువకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కద్లాల్: యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని మక్తమాదారంలో వెలుగు చూసింది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన స్వర్ణకంటి కల్యాణి(19) ఈ నెల 11న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లింది. దీంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా లభించలేదు. ఈ మేరకు గురువారం కల్యాణి తల్లి బావమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అస్వస్థతతో ఉపాధి కూలి మృతి



రాములు నాయక్ (ఫైల్)

కద్లాల్: అస్వస్థతకు గురై ఉపాధిహామీ కూలి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గోవిందాయిపల్లి తండాలో గురువారం చోటు చేసు కుంది. సర్పంచ్ సభావట్‌రాము తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందాయిపల్లితండాకు చెందిన కేతావత్ రాములు నాయక్(44) గురువారం ఉదయం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరి గి వస్తుండగా ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కద్లాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడిది నిరుపేద కుటుంబమని, బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలని సర్పంచ్ రాము కోరారు.

ఖర్గేతో టీఆర్‌ఆర్ భేటీ

పరిగి: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జిల్లా రాజకీయాలపై చర్చించారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ బూత్ లీడర్స్ మీటింగ్ అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు టీఆర్‌ఆర్ కలిసి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల గురించి చర్చించారన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కోరారన్నారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కష్టపడి పని చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసే దిశగా కార్యాచరణ రూపొందించాలని తెలిపారన్నారు.

గ్రామ పంచాయతీలో చోరీకి యత్నం

నందిగామ: మండల పరిధిలోని చాకలిగుట్టతండా గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి గురువారం తెల్లవారుజామున దుండగులు చొరబడ్డారు. నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామ పంచాయతీలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి వస్తువుల కోసం వెతికారు. అక్కడ ఏమీ లభించకపోవడంతో స్టోర్ రూంలోని క్రికెట్ కిట్‌ను ఎత్తుకెళ్లిపోయారు. సంఘటన స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ కార్యదర్శి శ్రీనివాసచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఈ ఘటనకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఇద్దరు వ్యక్తులు ఈ దొంగతనానికి యత్నించినట్లు సీసీ కెమెరాలో గుర్తించారు. వీటి ఆధారంగా కేసును ఛేదిస్తామని ఆయన తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామ సమీపంలో చెట్ల కింద కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావటంతో దాడి చేసి ఏడుగురిని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబ్రహ్మం తెలిపారు.